

వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులు

# వర్ధన్నపేట పట్టణానికి కొత్త హంగులు

- శరవేగంగా అభివృద్ధి పనులు
- అంబేద్కర్ సెంటర్‌కు కొత్త శోభ
- ఆకట్టుకుంటున్న సెంట్రల్ లైటింగ్
- రూ.2కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంపై సర్వత్రా హర్షం

వర్ధన్నపేట, అక్టోబర్ 5 : నూతనంగా ఏర్పడిన వర్ధన్నపేట మున్సిపాలిటీ పట్టణానికి కొత్త హంగులు సంతరించుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రాన్ని మున్సిపాలిటీగా ప్రకటించిన తరువాత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. దీంతో వర్ధన్నపేట పట్టణంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా వరంగల్–ఖమ్మం జాతీయ ప్రధాన రహదారిని పట్టణంలో వైడెనింగ్ చేయించడంతోపాటు కొత్తగా విద్యుత్‌లైన్లను ఏర్పాటు చేశారు. పాత రహదారి పక్కనే ఉండే విద్యుత్ స్తంభాలను కూడా తొలగించి రెండు వైపులా బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రహదారిపై అధునాతన పద్ధతిలో డివైడర్‌ను నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో వర్ధన్నపేట రాత్రి సమయంలో పాలపుంతగా కనిపిస్తున్నది. రహదారి పక్కనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం జరుగుతుండడంతో స్థానిక వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. దీనికితోడు వర్ధన్నపేటలో 50ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీని ఆధునీకరించడంతో పాటు అంతర్గత సీసీరోడ్ల నిర్మాణంతో వర్ధన్నపేటలో పట్టణ వాతావరణం కనిపిస్తున్నది.

**రూ.50 లక్షలతో అంబేద్కర్ సెంటర్‌లో అభివృద్ధి..**

వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిలోని వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌కు కొత్త హంగులు సంతరించుకుంటున్నాయి. జాతీయ రహదారి కేవలం డబుల్ రోడ్డుగా ఉండడంతోపాటు రహదారి మధ్యలో అంబేద్కర్ విగ్రహం ఉండడం వల్ల అంబేద్కర్ సెంటర్ ఇరుకుగా ఉండేది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి పనులకోసం సుమారు రూ.100 కోట్ల మేరకు గత నాలుగేళ్లుగా విడుదల చేసింది. దీంతో ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆధ్వర్యంలో పట్టణంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పట్టణంలో జాతీయ రహదారిని వైడెనింగ్ చేసి రూ.50లక్షల వ్యయంతో అంబేద్కర్ జంక్షన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. పాత అంబేద్కర్ సెంటర్ మధ్యలోనే అధునాతన పద్ధతిలో సర్కిల్‌ను ఏర్పాటు చేసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం చుట్టూ సర్కిల్ పచ్చదనం ఉండేలా పనులు జరుగుతున్నాయి. విగ్రహం పక్కన కూడా సింహాలు, ఇతర విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.2కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్..**

అంబేద్కర్ సెంటర్ సర్కిల్ పక్కనే రూ.2కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం జరుగుతుండడంతో వర్ధన్నపేట పట్టణానికి చెందిన వ్యాపారులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడలి పక్కనే మార్కెట్ ఏర్పాటు చేస్తుండడం వల్ల రైతులు, వ్యాపారులు సులువుగా మార్కెట్‌లోకి కూరగాయలు, ఇతర వస్తువులను మార్కెట్‌కు తీసుకువచ్చే వీలు ఉంటుంది. దీనికితోడు ఇంతకాలం రహదారి పక్కనే చిన్న చిన్న షెడ్‌లు వేసుకొని వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఇకపై మార్కెట్‌లోనే కూరగాయాలు, మాంసాహారం, ఇతర నిత్యావసర సరుకులు విక్రయించుకునే అవకాశం ఏర్పడనున్నది. రైతులు కూడా వారు పండించే కూరగాయలు, ఇతర ఆహార పంటలను కూడా నేరుగా మార్కెట్‌కు తరలించి వ్యాపారులకు విక్రయించుకునే సౌకర్యం మెరుగు కానున్నది. కూరగాయలు, పండ్లు, అన్ని రకాల నిత్యావస సరుకులు కూడా ఒకే చోట లభించనున్నందున పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు సంగెపు వాగు వద్దనే అధునాతనంగా రూ.2కోట్లతో దోబీఘాట్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దుస్తులను శుభ్రం చేసే అధునాతనమైన యంత్రాలు రానున్నందున రజక వృత్తిదారులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్ని మెరుగైన వసతులతో సంగెపువాగు ఒడ్డుకు శ్మశాన వాటిక నిర్మాణ పనులు కూడా పూర్తవుతున్నాయి. గత నాలుగేళ్లలో వర్ధన్నపేట పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో వర్ధన్నపేట పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయి. అనేక సమస్యలతో ఉన్న వర్ధన్నపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు పట్టణ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సెంట్రల్ లైటింగ్‌తో పట్టణ వాతావరణం..**

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో వర్ధన్నపేటలో పట్టణ వాతావరణం నెలకొన్నది. ఆకేరువాగు నుంచి మొదలుకొని సంగెపువాగు, అంబేద్కర్ సెంటర్ నుంచి ఫిరంగిగడ్డ వరకు జాతీయ రహదారిపై రూ.1.99 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో రాత్రి సమయంలో వర్ధన్నపేట పట్టణంలో విద్యుద్దీపాల కాంతిలో వెలిగిపోతున్నది. గతంలో ఇరుకురోడ్డుతో లైటింగ్ లేకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. అంతేకాక విద్యుత్ ఆధునీకరణ పనులు కూడా చేయడంతో గృహాల వినియోగదారులు, వ్యాపారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే డివైడర్‌పై ఏర్పాటు చేసిన పూలమొక్కలతో పట్టణానికి కొత్త శోభ సంతరించుకుంది.



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్



ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

## రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

**వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్**

కాశీబుగ్గ, అక్టోబర్ 5 : సీఎం కేసీఆర్ రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గురువారం 3వ డివిజన్‌లోని పైడిపల్లి, ఆరపల్లి, కొత్తపేటలకు చెందిన రైతులు ఎమ్మెల్యే రమేశ్‌ను కలిసి తమకు పంట నష్టం చెక్కులు రాలేదని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ రైతుల సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట విలీన గ్రామాల డివిజన్ల ఫోరం కన్వీనర్ నేరెళ్ల రాజు, రైతులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి : చీరెలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాణి, ఎంపీడీవో

## బతుకమ్మ చీరెలు పంపిణీ

హసన్‌పర్తి/ పర్వతగిరి, అక్టోబర్ 5 : హసన్‌పర్తి మండలంలోని జయగిరిలో సర్పంచ్ బొల్లవేణి రాణీరాజు ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ రేనుకుంట్ల సునీత, ఎంపీడీవో రామకృష్ణ హాజరై చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మి, గ్రామ సెక్రటరీ వెంకన్న, శ్రీధర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పర్వతగిరి మండలంలోని వడ్లకొండలో బతుకమ్మ చీరెలను సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజుయాదవ్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంతంగి ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ముగ్గురు సోదరులు



ముగ్గురు సోదరులను సత్కరిస్తున్న సర్పంచ్ సతీశ్

వర్ధన్నపేట, అక్టోబర్ 5 : ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గురువారం విడుదలైన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో సివిల్ ఉద్యోగాలు సాధించారు. మండలంలోని కడారి గూడెం గ్రామానికి చెందిన కట్కూరి అశోక్‌రెడ్డి ముగ్గురు కుమారులు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరీక్షలు రాయడంతోపాటు అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో గురువారం విడుదలైన ఫలితాల్లో అశోక్‌రెడ్డి ముగ్గురు కుమారులు కట్కూరి సంపత్, కట్కూరి రామ్, కట్కూరి లక్ష్మణ్‌లు అర్హత సాధించారు. దీంతో వారి కుటుంబ స భ్యులతోపాటు గ్రామస్తులు సం తోషం వ్యక్తం చేశారు. కాగా ముగ్గురు సోదరులను గ్రామ సర్పం చ్ మంద సతీ శ్ ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన శ్రీరామోజు విజయ్, బొంతల నితిన్, మైదం రమ్య, భాషబోయిన రఘుపతి, మాజోజు పవన్ అనే ఐదుగురు కూడా ఉద్యోగాలు సాధించారు. అలాగే కొత్తపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రంజిత్, నల్లబెల్లి గ్రామానికి చెందిన తాటికాయల రంజిత్ అనే యువకుడు కూడా పోలీసు ఉద్యోగం సాధించాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉద్యోగాలు సాధించిన యువకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సిద్ధాపూర్‌లో నలుగురు ఎంపిక**

హసన్‌పర్తి : మండలంలోని సిద్ధాపూర్‌కు చెందిన జనగాం సంజయ్‌గౌడ్, అనగాని అజయ్, బొక్క అన్వేశ్, దామెర ప్రవళిక కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గురువారం సర్పంచ్ జనగాం ధనలక్ష్మికిరణ్ ఉద్యోగాలకు ఎంపికైన వారిని శాలువాతో సత్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ యువతకు ఉద్యోగాలు కల్పించి వారిని ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్నారని తెలిపారు.



ప్రవళికను సన్మానిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

## వాటర్‌ప్లాంటు ప్రారంభం



వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న సర్పంచ్ వర్కాల రమేశ్

పర్వతగిరి, అక్టోబర్ 5 : కొంకపాక ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను సర్పంచ్ వర్కాల రమేశ్ గురువారం ప్రారంభించారు. విద్యార్థులు వాటర్‌ప్లాంటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కర్నిళ్ల మోహన్‌రావు, ఫౌండేషన్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, విద్యా కమిటీ చైర్మన్ సూర్ణ లింగయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీను, సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలువురికి కానిస్టేబుల్ ఉద్యోగాలు



అజయ్‌కుమార్



విజయ్‌కుమార్



శ్రీకాంత్

రాయపర్తి, అక్టోబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం–రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులు సంయుక్తంగా బుధవారం రాత్రి విడుదల చేసిన కానిస్టేబుల్స్ రాత పరీక్షల ఫలితాల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువతీయువకులు అత్యుత్తమ మార్కులు సాధించి కానిస్టేబుల్ కొలువులు సాధించారు. మండలంలోని జయరాంతండా (ఎస్) గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీకాంత్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మండల కేంద్రానికి చెందిన పీరని పరశురాములు కుమారులైన పీరని అజయ్‌కుమార్, విజయ్‌కుమార్‌లు కానిస్టేబుల్స్‌గా కొలువులు సాధించడంతో ఆ కుటుంబాలతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కమ్యూనిటీ హాల్‌కు నిధుల మంజూరుపై హర్షం

పర్వతగిరి, అక్టోబర్ 5 : మండలంలోని ఏనుగల్లు గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయడంపై విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కోశాదికారి అరిగల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. గురువారం సమావేశం ఏర్పాటు చేసి నిధుల మంజూరుకు సహకరించిన గ్రామ సర్పంచ్ దమ్మిశెట్టి సంధ్యారాణి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్‌రావుకు, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షులు గూడ నరేందర్‌వర్మ, ఎంపీటీసీ కోల మల్లయ్య, సొసైటీ మాజీ చైర్మన్ గంధం బాలరాజును ఘనంగా సన్మానించారు. నిధుల మంజూరుకు సహకరించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపనపెల్లి దూడల మల్లన్న దేవస్థానం డైరెక్టర్ దుడ్డు మహేందర్, వార్డు సభ్యులు తమ్మిశెట్టి శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు కాగితాల శ్రావణ్, హరీశ్, రమేశ్, సురేశ్, వెంకన్న, సుమన్, రాజు, బ్రహ్మం, వెంకటనారాయణ, అనిల్, రాజేశ్, సాంబశివచారి, సత్యం, సందీప్ పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం

వర్ధన్నపేట, అక్టోబర్ 5 : స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి వేలం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేలం పాటలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వాహనం విలువలో 50శాతం ధరావత్తుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆమె తెలిపారు.